

పెద్దోళ్లకు ఇచ్చేయాలంటూ బెదిరింపులు

- జీరు చిట్టితల్లి, రైతు, అన్నవరం



మా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన నాలుగెకరాల్లో తోటలు వేసుకుని కుటుంబం మొత్తం జీవిస్తున్నాం. 1996లో మా తండ్రికి పట్టా ఇచ్చారు. కొద్దిరోజుల నుంచి ఈ భూములపై కన్నేసిన కొందరి నుంచి ఒత్తిడి వస్తోంది. పెద్దోళ్లకు ఈ భూములు ఇచ్చేయాలని, లేకపోతే బలవంతంగా తీసుకుంటామని బెదిరించారు. గురువారం ఒక్కసారిగా బయట నుంచి కొందరిని తీసుకుని వచ్చి భూములు తీసుకునేందుకు యత్నించగా, ఆడ మగా కలిసి వారిని అడ్డుకున్నాం.

భారీగా బెట్టింగ్



ఎన్నికల ఫలితాలపై విపరీతంగా పందాలు

- కూటమి గెలుస్తుందని అత్యధికులు...
- వైసీపీపై కాసేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి
- దాంతో కీలక నియోజక వర్గాల ఫలితాలు, ప్రముఖుల మెజారిటీలపై పందెంరాయుళ్ల దృష్టి
- శ్రీకాకుళం, చీపురుపల్లి, విశాఖపట్నం నార్త్, వెస్ట్, మాడుగుల, పాడేరు నియోజకవర్గాల్లో గెలుపు/ఓటములపై...
- చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లకు లభించే మెజారిటీలపైనా బెట్టింగ్
- టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీలకు లభించే ఎంపీ స్థానాలపై కూడా...
- చేతులు మారుతున్న రూ.కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరో మూడు రోజుల్లో వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు స్పీడ్ పెంచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతోంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న దానిపైనే పందాలు సాగు తుంటాయి. ఈసారి కూడా ఏప్రిల్ నెలాఖరు వరకూ అలాగే నడిచింది. అయితే, మే నెల ప్రారంభం నుంచి మాత్రం వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ కాసేందుకు చాలామంది వెనకడుగు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా పోలింగ్ తరువాత కూటమి విజయం సాధిస్తున్న టాక్ రావడంతో వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్ వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో బెట్టింగ్ రాయుళ్ల ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయి?, చీపురుపల్లి, ఎచ్చెర్ల, గజపతినగరం వంటి నియోజక వర్గాల్లో ఎవరు గెలుస్తారు?, అలాగే ఉమ్మడి విశాఖ నగర పరిధిలోని నార్త్, పశ్చిమ నియోజకవర్గాల ఫలితాలపై పందాలు వేస్తున్నారు. విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సాధించే మెజారిటీ, అలాగే అనకాపల్లి జిల్లా మాడుగుల, అల్లూరి జిల్లా పాడేరు నియోజక వర్గాల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై బెట్టింగ్ కడుతున్నారు.

కూటమి వైపు జోరుగా పందాలు..

ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందన్న అభి ప్రాయాన్ని ఎక్కువ మంది వ్యక్తం చేస్తుండడంతో.. అటువైపు పందాలకు అత్యధికులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వైసీపీ గెలుస్తుందని పందెం కాసేందుకు ఎవరూ దొరక్క పోవడంతో...హోరీహోరీగా పోటీ జరిగిన నియోజక వర్గాలపై దృష్టిపెట్టారు. శ్రీకాకుళం జిల్లాలో మంత్రి ధర్మాన ప్రసాద రావు, చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణల గెలుపు/ ఓటములపై, అలాగే పలాస, నరసన్నపేటల్లో కూటమి అభ్యర్థుల విజయంపై జోరుగా పందాలు సాగుతున్నాయి. శ్రీకాకుళం ఎంపీ స్థానంపై పందెం కాసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. విజయనగరం ఎంపీ స్థానంపై మాత్రం జోరుగా పందాలు సాగుతున్నాయి. మొన్నటి వరకు వైసీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ గెలుస్తారంటూ .. మిగతా 6వ పేజీలో

అన్నవరం భూములపై పెద్దల కన్ను

భోగాపురం విమానాశ్రయానికి కూతవేటు దూరంలో గ్రామం

- ఇప్పటికే పలు భూములు చేజిక్కించుకున్న బినామీలు
- మిగిలినవి కూడా ఇవ్వాలంటూ బెదిరింపులు
- ఎదురుతిరిగిన రైతులు



అన్నవరంలో డి.పట్టాదారుల ఆందోళన

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి):

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో గల భీమిలి మండలం అన్నవరం భూములపై ప్రభుత్వ పెద్దల కన్నుపడింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి బినామీగా ప్రచారం సాగుతున్న త్రిలోక్ ప్రోద్బలంతో ఇప్పటికే గ్రామంలో పలువురు రైతులకు చెందిన భూములను చేజిక్కించుకున్నారు. ఇంకా మిగిలిన డి.పట్టా భూములను కూడా స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రైతులకు, ప్రభుత్వ పెద్దల బినామీలు, వారికి తోడుగా నిలిచిన వారికి మధ్య గొడవ జరిగింది.

గ్రామంలోని సర్వే నంబర్ 101-1లో సుమారు 200 ఎకరాలు ఉంది. ఇందులో ప్రభుత్వ భూములతోపాటు డి.పట్టా భూములు ఉన్నాయి. అన్నవరంతోపాటు పొరుగునే ఉన్న భోగాపురం మండలం తూడెం గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులకు అక్కడ పట్టా భూములు ఉన్నాయి. అవి పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చాయి. ఈ సర్వే నంబరులో ఒబెరాయ్ ఇంటర్నేషనల్ హోటల్‌కు కొంత భూమి కేటాయించగా, మరికొంత ఇళ్ల స్థలాల కోసం వీఎంఆర్‌డీఏ సమీకరించింది. కొందరు రైతులు ల్యాండ్ పూలింగ్‌ను వ్యతిరేకించి కోర్టుకు వెళ్లి స్టేటస్‌కో తెచ్చుకున్నారు. అయినప్పటికీ రెవెన్యూ సిబ్బంది, పోలీసులు గురువారం అన్నవరం వెళ్లి ఆ భూముల చుట్టూ సిమెంట్ స్తంభాలు పాతేందుకు యత్నించారని తూడెం రైతులు చెబుతున్నారు. వారితోపాటు వైసీపీ ... మిగతా 6వ పేజీలో

జవహర్‌రెడ్డి చూసి వెళ్లారు

- డెక్కలి సోంబాబు, అన్నవరంలో డీ.పట్టా రైతు



మాది భోగాపురం మండలం తూడెం గ్రామం. పొరుగునున్న భీమిలి మండలం అన్నవరంలో మా తాత స్వామికి ప్రభుత్వం ఐదెకరాలు (సర్వే నంబరు 101-1) ఇచ్చింది. డీ పట్టా కూడా ఉంది. రెండున్నర ఎకరాలు మా తండ్రికి, మరో 2.5 ఎకరాలు చిన్నాన్నకు వాటాగా వెళ్లింది.ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో తోటలు పెంచుకుని జీవిస్తున్నాం.ల్యాండ్‌పూలింగ్‌కు భూములు అడిగితే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చు కున్నాం. ఈనెల 20న జవహర్‌రెడ్డి భోగాపురం మీదుగా అన్నవరం వరకు వచ్చి మా భూములు చూశారు. గురువారం కొందరు వ్యక్తులు, రౌడీలు, వైసీపీ నేతలు వచ్చి భూములు తమవని బెదిరించారు. ఎదురించి నిలబడ్డాం.

రౌడీలు బెదిరించారు

- గాబు వరలక్ష్మి, అన్నవరం గ్రామ రైతు



స్థానికంగా కొందరు, పోలీసులు, వీఆర్వో కలిసి గురువారం మమ్మల్ని బెదిరించారు. రౌడీలు కూడా వచ్చారు. వారు దురుసుగా మాట్లాడుతూ చేతుల్లో సెల్‌ఫోన్లు లాక్కున్నారు. అక్కడే ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏమి చేయలేమని చేతులెత్తేశారు. మేమెప్పుడూ చూడని వ్యక్తులు రావడంతో అనుమానం వచ్చి అందరం ఒక్కటయ్యాం. గురువారం వారిని ఆపగలిగాం గానీ.భవిష్యతులో రౌడీల నుంచి ప్రాణభయం ఉంది. ప్రభుత్వం ఇచ్చిన తోటలే జీవనాధారంగా బతుకుతున్న మాపై పెద్దోళ్లు దౌర్జన్యం చేస్తే మా పరిస్థితి ఏమిటి?

ఫలితాలు రాకముందే మొదలు

పోస్టింగ్‌ల కోసం అప్పుడే పైరవీలు

- కూటమి గెలుస్తుందనే ఉద్దేశంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు టచ్‌లోకి వెళుతున్న కొంతమంది అధికారులు
- పోలీస్, రెవెన్యూ శాఖల్లోనే ఎక్కువ
- నగరంలోనే కొనసాగించాలని కొందరు, ఇక్కడ పోస్టింగ్ కోసం మరికొందరు...
- ఐదేళ్లుగా కనీసం తమను పలకరించని అధికారులు ఇప్పుడు అదేపనిగా ఫోన్లు చేస్తుండడంపై టీడీపీ నేతల ఆశ్చర్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల హడావుడి ఇంకా ముగియలేదు. ఫలితాలు వెల్లడి కావడానికి ఇంకా నాలుగు రోజులు సమయం ఉంది. అయితే నగరంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అధికారులు మాత్రం ఇప్పటికే పైరవీలు మొదలెట్టేశారు. సర్వేలన్నీ కూటమికి అనుకూలంగా వస్తుండడంతో ఆ పార్టీల నేతలకు టచ్‌లోకి వెళుతున్నారు. ఇంతకాలం కనీసం ఫోన్ ఎత్తని వారంతా ఇప్పుడు తమను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తుండడంతో కూటమి నేతలు ఆశ్చర్యపోతున్నారు.

నగరంలో పోస్టింగ్ కోసం అన్ని శాఖల్లోనూ విపరీతమైన డిమాండ్ ఉంటుంది. విద్య, ఉద్యోగ అవకాశాలతోపాటు కుటుంబంతో ఆహ్లాదంగా గడిపేందుకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగులు విశాఖలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. పోలీస్, మునిసిపల్, రెవెన్యూ వంటి శాఖల్లో అయితే అదనపు ఆదాయం కూడా భారీగా వస్తుందనే భావన కొంతమంది అధికారుల్లో ఉండడంతో పోస్టింగ్‌కు మరింత డిమాండ్ ఉంటుంది. గత ఐదేళ్లు అధికశాతం అధికారులు వైసీపీకి వీర విధేయులుగా పనిచేశారు. కొంతమంది అయితే తాము ప్రభుత్వ ఉద్యోగులమనే విచక్షణ కూడా మరిచిపోయి పార్టీ కార్యకర్తల మాదిరిగా వ్యవహరించారు. ఒకవేళ అధికారులెవ రైనా టీడీపీ, జనసేన వంటి ప్రతిపక్ష పార్టీల నేతలతో మాట్లాడితే వైసీపీ నేతలు వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేవారు. దీంతో గత ఐదేళ్లలో విపక్ష నేతలు ఎదురుపడినా సరే ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులు కనీసం పలకరించేందుకు కూడా సాహసించేవారు కాదు. ఒకవేళ ఎవరైనా వినతిపత్రం అందించడానికో..ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరేందుకో కార్యాలయానికి వెళితే ఏదో కారణం చెప్పి కిందిస్థాయి సిబ్బందికి ఇచ్చేయాలని చెప్పి వెనక్కి పంపించేసేవారు.

అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీతో కూడిన కూటమి అధికారంలోకి రాబోతుందని అత్యధిక సర్వే సంస్థలు చెబుతున్నాయి. నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, ఉద్యోగులు కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు నగరంలో కీలకమైన పోస్టింగ్‌లపై కన్నేశారు. అందుకోసం ఇప్పటికే తమకు పరిచయస్తులైన కూటమి నేతలతో టచ్‌లోకి వెళ్లారు. తమకు సన్నిహితులైన నేతల ద్వారా నగరంలోని కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పోలీస్ శాఖలో సీఐ, ఏసీపీ స్థాయి అధికారులతోపాటు ఐజీ స్థాయి అధికారులు, రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ స్థాయి అధికారులతోపాటు డిప్యూటీ ... మిగతా 6వ పేజీలో

బహిరంగ ధూమపానం నిషేధం అమలు

నోడల్ అధికారిగా జాయింట్ సీపీ నియామకం

పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ప్రకటన

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి):



నగరంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాల పర్యవేక్షణ, బహిరంగ ధూమపాన నిషేధం అమలు కోసం నోడల్ అధికారిగా జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్పని సీపీ రవిశంకర్ అయ్యన్నార్ నియమించారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, సీఐఐ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తుల వినియోగం, ఈ-సిగరెట్ల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేన్సర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వున్నా మురళీకృష్ణ, సీఐఐ ప్రతినిధి హర్షవర్ధన్ నగరంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు నిషేధంతోపాటు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం పక్కాగా అమలుచేయడంతోపాటు ఈ-సిగరెట్ల విక్రయాలు జరగకుండా గట్టిచర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై త్వరలోనే వివిధ రంగాల ప్రముఖులు, వైద్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కార్యాచరణ రూపొందిస్తామని సీపీ హామీ ఇచ్చారు. కేన్సర్ కారక పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా చూసేందుకు జాయింట్ సీపీని నోడల్ అధికారిగా నియమిస్తున్నట్టు సీపీ ప్రకటించారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

చేతులు మారిందనే ఉద్దేశంతో రెండేళ్ల క్రితం ఆనందపురం మండలం రామవరంలో 1.53 ఎకరాలకు సంబంధించిన డి.పట్టా రద్దు

- రెవెన్యూ స్వాధీనం
- తదనంతరం పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయింపు
- ఇప్పుడు ఆ భూమి పట్టాదారుని చేతిలోనే ఉందంటూ 'ఫ్రీ హోల్డ్'
- అమ్ముకునేందుకు అనుమతులు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి):

ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేటాయించిన ప్రభుత్వ భూమిని పట్టాదారు చేతిలో ఉన్నట్టు పేర్కొంటూ 'ఫ్రీహోల్డ్' అనుమతి (అమ్ముకునేందుకు గ్రీన్‌సిగ్నల్) ఇచ్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆనందపురం మండలం రామవరం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమికి తహసీల్దార్ ఫ్రీహోల్డ్ ఇచ్చేశారు. గతంలో ఆ భూమికి సంబంధించిన పట్టాను ఒక అధికారి రద్దు చేసి వెనక్కి తీసుకోగా...తాజాగా దానిని పక్కనపెట్టిన తహసీల్దారు అనుమతులు మంజూరుచేసేలా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. వివరాల్లోకి వెళితే...

రామవరం సర్వే నంబర్ 164-3లో 1.53 ఎకరాలు, సర్వే నంబర్ 169-2లో 87 సెంట్లు భూమిని నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వం అక్కిరెడ్డి బంగారయ్యకు కేటాయించింది. అయితే ఆయన మొత్తం 2.4 ఎకరాలను విశాఖకు చెందిన పిళ్లా వెంకటరమణమ్మకు 99 సంవత్సరాల లీజుకు ఇచ్చారు. దీనిపై గతంలో గ్రామస్థులు ఆనందపురం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ చట్టం 1977 ప్రకారం విచారణ జరిపిన అధికారులు ఆ 2.4 ఎకరాలకు సంబంధించి పట్టా రద్దు చేయాలని సిఫారసు చేశారు. అయితే ఆనందపురం తహసీల్దారు కార్యాలయంలో ఏమి మతలబు జరిగిందోగానీ సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాల డీపట్టాను 2021 జూన్ ఐదో తేదీన (ఆర్‌సీ నంబరు328/2021/ఎ) రద్దు చేసిన అధికారులు, అక్కడ హెచ్చరిక బోర్డు పెట్టారు. మిగిలిన 87 సెంట్ల విషయాన్ని పక్కనపెట్టేశారు. అందుకు భారీగా సొమ్ములు చేతులు మారాయన్న ... మిగతా 6వ పేజీలో



ప్రభుత్వం వెనక్కి తీసుకున్న తరువాత ఫ్రీహోల్డ్ చేసిన భూమి ఇదే

రోగులకు మెరుగైన సేవలు అందించండి

- ఆస్పత్రిలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ఆలోచించవద్దు
- త్వరలో అన్నీ సర్దుకుంటాయి
- కేజీహెచ్ విభాగాధిపతులతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి):



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కేజీహెచ్‌లో తాజాగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం ఆస్పత్రిలోని విభాగాధిపతులతో సమావేశ మయ్యారు. సూపరింటెండెంట్ కార్యాలయం పైఅంతస్థులో గల కాన్ఫరెన్స్‌లో హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన సుమారు గంటపాటు వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రిలో నెలకొన్న తాజా పరిస్థితులను వైద్యులు పట్టించు కోవద్దని, రోగులకు మెరుగైన సేవలను అందించడంపై దృష్టిసారించాలన్నారు. కొద్దిరోజుల్లో ఈ వివాదాలన్నీ సద్దుమణుగుతాయని, ఈలోగా ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించాలని ఆదేశించారు. న్యాయ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు డాక్టర్ శివానంద సూపరింటెండెంట్‌గా కొనసాగుతారని, విభాగాలకు సంబంధించిన అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో వివా దాలు తలెత్తడానికి గల కారణాలు గురించి కొందరు వైద్యు లను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సి పాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూప రింటెండెంట్ డాక్టర్ కె.శివానందతోపాటు పలు విభాగా ధిపతులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.శివానంద నియ మితులయ్యారు. ఆస్పత్రిలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ నెల రోజులు సెలవు పెట్టారు. ఈ సెలవు కాలానికి సూపరింటెండెంట్‌గా ఆర్థో విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ శివానందను నియమిస్తూ డీఎంఈ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సూప రింటెండెంట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే డీసీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ ఎం.శంకరరావు నియమితు లయ్యారు. ఆయన సుదీర్ఘకాలంగా సెలవులో ఉన్నారు. కొద్దిరోజుల కిందట వరకు ఆ స్థానంలో పనిచేసిన లక్ష్మి తులసిని ఆరోపణలపై సరండర్ చేసిన విషయం తెలిసిందే.



బాధ్యతలు స్వీకరించిన శివానందకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అలంకరణలో అమ్మవారు

పూర్ణామార్కెట్, మే 31: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో జరిపిన ఈ పూజల్లో 10 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. అనంతరం పసుపు, కుంకుమ, పూలతో విగ్రహాన్ని అలంకరించి అర్చకులు పూజలు చేశారు. ప్రతీ శుక్రవారం జరిగే క్షీరాభిషేకసేవల్లో పాల్గొన దలచిన భక్తులు 500 రూ. టిక్కెట్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సహాయ కార్యనిర్వహణాధికారి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నేతాజీ వంతెనపై ఏర్పాటు చేసిన పూల మొక్కలు

జ్ఞానాపురం,మే 31: జ్ఞానాపురం నేతాజీ వంతెనపై సంరక్షణ లేక ఎండిపోయిన మొక్కల స్థానంలో జీవీఎంసీ ఉద్యానవన శాఖ అధికారులు కొత్తవినాటారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'మూన్నాళ్ల ముచ్చటగా అభివృద్ధి పనులు' శీర్షికన వచ్చిన కథనానికి ఉద్యానవన శాఖ అధికారులు స్పందించారు. వంతెనపై మొక్కలు నాటారు. దీంతో పాదాచారులు, వాహనదారులు హర్షం వక్తం చేశారు.

సంగీత విభావరి రేపు

డాబాగార్డెన్స్, మే 31: మెలోడి క్రియేటర్స్ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం కార్యక్రమ గోడపత్రికను సెంచూరియన్ యూనివర్సిటీ గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కె.వీరస్వామి, వివిధ సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

చలివేంద్రాలు సరే.. నీరందించే వారేరీ?

- జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో ఖాళీగా పందిళ్లు
- తీరని పాదచారులు, వాహనదారుల దాహార్తి



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కానరాని పనివారు



గాంధీ విగ్రహం వద్ద ..

డాబాగార్డెన్స్, మే 31: గ్రేటర్ 31వ వార్డులోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో వేసవి నేపథ్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాల వద్ద కనీసం నీటిని అందించేందుకు ఎవరూ లేకపోవడంతో దాహార్తితో వచ్చేవారు గగ్గోలు పెడుతున్నారు. వాతావరణ మార్పులతో ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద, జీవీఎంసీ కార్యాలయ పరిసరాల్లో నిత్యం ప్రజలు తాకిడి అధికంగా ఉంటోంది. వృద్ధులు, వికలాంగలు, విద్యార్థులు అటుగా రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు సదరు ప్రాంతాలనుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సైతం వస్తుంటారు. ఈ నేపథ్యంలోని తాగేందుకు చలివేంద్రాలున్నా వాటి వద్దకు తీరా వెళ్తే ..కనీసం అక్కడ మనుమలు లేకపోవడంతో నిరాశతో పలువురు వెనుతిరిగివెళ్లిపోతున్నారు. జీవీఎంసీ ఏర్పాటుచేసిన సంబంధిత వ్యక్తులు అక్కడ ఉండకుండా చలివేం ద్రాలను గాలికి వదిలేస్తున్నారు. దీంతో దాహం తీరే మార్గంకానరాక పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రస్థాయి తపాలా శాఖ అధ్యక్షుల సదస్సు



అవార్డులు ప్రదానం చేస్తున్న ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్స్ జనరల్ ప్రకాష్

సాగర్‌నగర్, మే 21 : రుషికొండ సాయిప్రియా రిసార్ట్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి తపాలా శాఖ అధ్యక్షుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్స్ జనరల్ కె. ప్రకాష్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో తపాలా శాఖ ప్రగతికి కృషి చేసిన 182 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ పోస్టల్ సిబ్బందిని ప్రోత్సహించడానికి, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విశాఖపట్నం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా మాట్లాడుతూ విశాఖపట్నం పోస్టల్ డివిజన్ వివిధ విభాగాల్లో 11 అవార్డులు కైవసం చేసుకుందన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్ ఎక్స్ పో



రుణాలకు సంబంధించి చెక్ అందిసున్న బ్యాంక్ అధికారులు

సీతంపేట, మే 31: ప్రముఖ ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆ ధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో శుక్రవారం రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నగరంలోని ప్రముఖ బిల్డర్స్, వాహన డీలర్స్, విద్యా రుణాల ఏజన్సీలు పాల్గొని వారి వాణిజ్య విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ షాలిని మీనన్, ఉప జోనల్ మేనేజర్ శంకర్ హేమ్‌రామ్, రీజనల్ మేనేజర్ నరసింహ కుమార్ పాల్గొని బ్యాంక్ పరిధిలో రిటైల్ రుణాలకు సంబంధించి వివరించారు. ఈ రుణాల సదావకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు: సీఐ



మెట్టు వద్ద దుకాణాలను తొలగిస్తున్న పోలీస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం, మే 31 : ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్డులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాదరావు మాట్లాడుతు.. రోడ్లపై ఇష్టానుసారం వ్యాపారాలు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలించడం తగదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తామన్నారు. కంచరపాలెం మెట్టు నుంచి మర్రిపాలెం జంక్షన్ వరకు నిత్యం ప్రత్యేక ట్రాఫిక్ బీట్‌ను ఏర్పాటు చేసి ఆక్రమణదారులపై చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ.బాలరాజు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గోవింద్, సత్తిబాబు,సిబ్బంది పాల్గొన్నారు.

కళలు మన సంస్కృతికి ప్రతిబింబం



నృత్య కళాకారిణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 31: కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో స్నేహాంజలి ఆర్ట్స్ అసోసియేషన్, నృత్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్యాన్సస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ సభ్యుడు డా.విశ్వకర్మ డీఆర్‌కే, కళాప్రపూర్ణ డా.జాలాది విజయ, మలేషియాకు చెందిన రాయవరపు శ్రీదేవి, స్నేహాంజలి ఆర్ట్ డైరెక్టర్ శైలజమూర్తి హాజరై జ్యోతి ప్రజల్వనగావించారు. పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మోహితపల్, ఇందిర పరుశురాం, డి.ఆర్.కె.సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పొగాకు ఉత్పత్తుల నిషేధం కఠినతరం చేయాలి

- లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు



పూరాతన ధూమపాన వస్తువులు, వివిధ రకాల యాష్‌ట్రేల పరిశీలిస్తున్న వైద్యులు



కేజీహెచ్‌లో వైద్య తనిఖీలు చేస్తున్న దృశ్యం

సీతమ్మధార, మే 31: జీవితంలో ఎంత ఎదిగామన్నది కాదని ఎంత ఆరోగ్యంగా ఉన్నామన్నది ముఖ్యమని లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ వి.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకుని సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో ధూమపానం నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినం ఒక్క రోజు కాదని నిరంతర ప్రక్రియగా పాటించాలని, తద్వారా తమ ఆరోగ్యంతోపాటు కుటుంబ సభ్యులు, ఎదుట వారి ప్రాణరక్షణకు కూడా దోహదపడాలన్నారు. ధూమపానం నిషేధంపై ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈసంర్భంగా పూరాతన ధూమపాన వస్తువులు, వివిధ రకాల యాష్‌ట్రేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, జేఆర్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ఆర్ మూర్తి, జీఎస్ శివప్రకాష్, బ్యాంకు సిబ్బంది, పలువురు ప్రముఖులు, ఇతర ఆసుపత్రుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నోటి కేన్సర్‌పై అవగాహన

మహారాణిపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా కేజీహెచ్‌లోని దంత వైద్య విభాగం లో నోటి క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాధిపతి వీవీఎస్ త్రివేణి ఆధ్వర్యంలో సుమారు 100మంది వెల్‌స్కోప్ అనే అధునాతన పరికరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. పొగాకు, గుట్కా, ఖైనీ, తంబాకు తదితర వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈసందర్భంగా మౌత్ వాష్‌లు, టూత్ పేస్టులు, కేన్సర్ మందులను రోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినోద్, లావణ్య, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఏబీ వెంకటేశ్వరరావు పోరాట స్ఫూర్తి భేష్'

సీతమ్మధార, మే 31: పోరాట స్ఫూర్తితో పదవీ విరమణ చేసిన డీజీ ర్యాంక్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకి మాజీ ఎమ్మెల్యే ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు అభినందనలు తెలిపారు. ధైర్యాన్ని కోల్పోకుండా ఐదేళ్లపాటు వెంకటేశ్వరరావు పోరాడడం గొప్పవిషయమని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామారాజు ఏ విధంగా చేశారో.. ఆ స్ఫూర్తితో పోరాటం చేసిన వెంకటేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలిపారు. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ ఇలానే వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఎప్పుడో ప్రజా తిరుగుబాటు వచ్చేదన్నారు. వెంకటేశ్వరరావు నిండు నూరేళ్లు ధైర్యంతో వెళ్లాలని మనస్ఫు స్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

నేడు 'డయల్ యువర్ సీపీ'

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ నుంచి సహాయం పొందాలనుకునేవారు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 0891-2523408కి ఫోన్ చేసి సమస్యను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని తెలి పారు. 12 నుంచి 12.30 వరకూ సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల నుంచి ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కారం

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన వారిని సీపీ రవిశంకర్ శుక్రవారం తన కా ర్యాలయంలో సత్కరించారు. సీటీసీ సీఐ ఎ. విశ్వేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ షేక్‌యూసఫ్, న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు, స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ ఆర్. మల్లేశ్వరరావు, పోర్ట్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.గంగాధరరావు, కంచరపాలెం ట్రాఫిక్ ఏఎస్ఐ ఎ. లక్ష్మణరావు, వన్‌టౌన్ ట్రాఫిక్ ఏఎస్ఐ కె.సత్యనారాయణ, పీఎంపాలెం క్రైమ్ ఏఎస్ఐ వి.సత్యారావు ఉద్యోగ విరమణ చేయడంతో వారందరినీ, కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ సన్మానించారు.

పాలీసెట్‌లో 374మంది ధ్రువపత్రాల పరిశీలన

కంచరపాలెం, మే 31 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్, పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన పాలీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 374 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు. రెండు హెల్ప్ లైన్ కేంద్రాల్లో 184 చొప్పున విద్యార్థులు హాజరయ్యారు.

లక్ష్మీ వినాయక ఆలయం వద్ద అన్న సమారాధన



అన్నదానం ప్రారంభిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, మే 31 : నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. బాలానంద శివాచార్య స్వామి ఆశీస్సులతో 51 రోజులపాటు నిర్విరామంగా బాటసారుల కోసం చలివేంద్రం నిర్వహించారు. ముగింపు సందర్భంగా దాతలు పి. అచ్యుత వంశీధర్ సహకారంతో 300 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాలానంద శివాచార్య స్వామి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నవరం భూములపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

నేతలు, కొందరు రౌడీలు వచ్చారంటున్నారు. పది రోజుల క్రితం జవహర్‌రెడ్డి అన్నవరం వచ్చారని, ఆ తరువాత త్రిలోక్ అనే వ్యక్తి భోగాపురం పరిసరాల్లో తిరుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ తీసుకోగా మిగిలిన భూమిని తమకు అమ్మాలని పెద్దలు ఒత్తిడి తీసుకువస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. చావోరేవో తేల్చుకోకపోతే భూములు పోతాయని గుర్తించి పోరాటానికి సిద్ధమైన రైతులు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

6వతేదీ వరకు 144 సెక్షన్ అమలు

- కలెక్టర్ మల్లికార్జున



మహారాణిపేట, మే 31: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఈ నేపథ్యంలో జూన్ 4 వ తేదీన రాజకీయ పార్టీలు ఎట్టిపరిస్థితుల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ మల్లికార్జున స్పష్టంచేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుం దన్నా రు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం తరఫున ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని లెక్కింపు కేంద్రాలలో పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని హెచ్చరించారు. ఈ ప్రక్రియను శాంతి యు తంగా పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 3వతేదీనుంచి 6తేదీవరకు 144వ సెక్షన్ విధించినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలలో ఐదుగురు కంటే ఎక్కువ మంది ఉండరాదన్నారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి బహిరంగంగా ప్రదర్శించకూడదన్నారు. లౌడ్ స్పీకర్లు వినియోగించకూడదని చెప్పారు. గెలుపొందిన అభ్యర్థి ధ్రువీకరణపత్రం స్వీకరించటానికి ఆయనతో పాటు కేవలం ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి వాహనాలకు అనుమతి లేదన్నారు. హాల్ లోనికి రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఐడీ కార్డు చూపిన వారికి మాత్రమే అనుమతి ఉంటుం ద న్నారు. మొబైల్ ఫోన్ తీసుకు రావటానికి వీలు లేదని తెలిపారు

తాళ్లవలసలో మందుగుండు సామగ్రి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

భీమునిపట్నం (రూరల్) మే 31 : మండలంలోని తాళ్లవలస పీహెచ్‌సీ సమీపంలో అక్రమాని చిన్నమ్మలు ఇంటి పక్క నున్న రేకుల షెడ్‌లో గురువారం రాత్రి విశాఖ టాస్క్‌ఫోర్సు పోలీసులు భారీ ఎత్తున మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్సు ఎస్ఐ భరత్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. భీమిలికి చెందిన కొక్కిరి అప్పన్న అక్కడ మందుగుండు అమ్మకాలు చేస్తున్న విషయాన్ని గమనించి అతనికి రెండు మూడుసార్లు హెచ్చరికలు జారీ చేశామన్నారు. దీంతో ఆయన తన స్థావరాన్ని తాళ్లవలసకు మార్చినట్టు చెప్పారు. దాడిలో వెయ్యి తారాజువ్వలు, వెయ్యి పుల్లలు లేని తారాజువ్వలు, బెల్టు బాంబులు, నీటి బాంబులు, సీమ టపాకాయలు 50 బస్తాలు, తౌజండ్ వాలా బాంబులు 500, 15 సంచులతో రాకెట్ బాంబులు, బస్తా సిల్వర్ ప్లేట్ బాంబులతో పాటు ఆరు గోనె సంచులతో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిని విజయనగరం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలో నిల్వ చేసి సరఫరా చేస్తున్నార న్నారు. ఎన్నికల ఫలితాల తరువాత గెలుపొందిన అభ్యర్థుల మద్దతుదారులకు అమ్మకాలు చేయడానికి వీటిని నిల్వ చేసినట్టు చెప్పారు. ఈమేరకు అప్పన్నను అరెస్టు చేసి, భీమిలి పోలీసులకు అప్పగించామని తెలిపారు.

సిద్ధాంజనేయునికి పంచామృతాభిషేకం

మురళీనగర్, మే 31 ; ఊర్వశిజంక్షన్ పాలిటెక్నిక్ కాలేజీ సమీపాన సూర్యానగర్-2 శ్రీ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు, అష్టోత్తర శత కలశస్నపనం నిర్వహించారు. సామూహిక సుందరకాండ పారాయణ జరిపారు. ఉదయం ఆంజనేయునికి తమలపాకుల అర్చన, సింధూర అర్చనలు నిర్వహించారు.మూడు రోజులపాటు ఉత్సవాల్లో జూన్ 1న శనివారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక అలంకరణలో స్వామి వారి దివ్య దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స సుబ్బరాజు తెలిపారు. మాధవధార జంక్షన్, బర్మాకాలనీ హనుమాన్ ఆలయాల్లో శనివారం జయంతి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

భారీగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

పందాలు కాసిన ఎంతోమంది ఇప్పుడు సైలెంట్ అయి పోయారు. కూటమి అభ్యర్థి తరపున అధిక మొత్తాన్ని ఇస్తామని ఆఫర్ చేస్తున్నా వైసీపీ నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ జిల్లాలోని ఎస్.కోట, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలపై భారీగా పందాలు సాగుతున్నాయి.

కీలక స్థానాల్లో మెజారిటీపైనా..

రాష్ట్రంలో కీలక నియోజక వర్గాల్లో అభ్యర్థులు సాధించే మెజారిటీపైనా పెద్దఎత్తున పందాలు సాగుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ మెజారిటీలపై జోరుగా పందాలు సాగుతున్నాయి. వీరి ముగ్గురిలో ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తుందన్న దానిపైనా బెట్టింగ్ జరుగుతోంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ కనీసం 30 వేలకుపైగా మెజారిటీ సాధి స్తారంటూ పందాలు కడుతున్నారు. అలాగే జనసేన పోటీ చేసిన స్థానాల్లో సగానికిపైగా గెలుచుకుంటుందని, రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, వైసీపీ లభించే ఎంపీ స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. కడపలో అవినాష్‌రెడ్డి గెలుపు/ఓటమి, మెజారిటీపై కూడా పందాలు సాగుతున్నాయి.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

గతంలో ఎన్నడూ పందాలు గురించి పట్టించుకోని ఎంతో మంది ఈసారి బెట్టింగ్‌కు ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం. వీరిలో చిన్న, పెద్ద అంతా ఉన్నారు. రూ.5 వేల నుంచి రూ.కోటి, అంతకు మించి పందాలు సాగుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల బెట్టింగ్ జరిగినట్టు చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఏపీలో జగన్ మరోమారు అధికారంలోకి వస్తారంటూ బెట్టింగ్ కడుతుండగా, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు కూటమి వైపు పందాలు కాస్తున్నారు. ఈసారి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా బెట్టింగ్‌లో భాగస్వామ్యులు కావడం గమనార్హం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూటమి గెలుస్తుందంటూ భారీ మొత్తంలో బెట్టింగ్ కట్టారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

... 5వ పేజీ తరువాయి

ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా గ్రామంలో పేదలకు సొంత ఇళ్ల నిర్మాణాల కోసం 164-3లో 1.53 ఎకరాలను కేటాయించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించడంతో ఆనందపురం రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం 57 మంది పేదలకు సెంటున్నర వంతున (72 గజాలు) ఇచ్చేందుకు నిర్ణయించారు. ప్లాట్లకు 84 సెంట్లు, రోడ్లకు 42 సెంట్లు, ఓపెన్ స్పేస్‌కు మిగిలిన భూమి కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్లాట్ల కోసం భూమిని చదునుచేశారు. అయితే ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగడంతో ఆ ప్రాంతమంతా తిరిగి పొదలు, చెట్లు పెరిగాయి. ఇదిలావుండగా డీపట్టా భూములకు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇస్తున్న నేపథ్యంలో భూములు కొనుగోలు చేస్తున్న బడాబాబులు రామవరంపై కన్నేశారు. పెద్దల సిఫారసు మేరకు పట్టా భూములకు జిల్లా అధికారులు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు ఇస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 26వ తేదీన ఇచ్చిన ప్రొసీడింగ్స్‌లో పేదల ఇళ్లకు కేటాయించిన సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాల భూమి ఉంది. గతంలో పట్టా రద్దు చేసి స్వాధీనం చేసుకుని...తరువాత ఇళ్ల కోసం కేటాయించిన భూమికి ఎలా ఫ్రీ హోల్డ్ అనుమతులు ఎలా ఇచ్చారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారిస్తే అనేక అక్రమాలు వెలుగులోకి వస్తాయని రామవరం గ్రామస్థులు అంటున్నారు.

పోస్టింగ్‌ల కోసం అప్పుడే పైరవీలు

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌స్థాయి అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. నగర పోలీస్ కమిషనర్‌గా కొన్నాళ్ల కిందట వరకూ పనిచేసిన అధికారి ఒకరు తిరిగి కమిషనర్‌గా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం ఆ శాఖలో జోరుగా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వం తనను అవమానకరంగా కొద్ది నెలలకే బదిలీ చేసిందని, తనకు తిరిగి ఇక్కడ పోస్టింగ్ ఇస్తే పోయిన పరువును దక్కించుకున్న సంతృప్తి ఉంటుందంటూ కూటమికి చెందిన నేతలను కలిసినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. అలాగే ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న అధికారి...తన కుటుంబ సభ్యులు టీడీపీ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేశారనే అక్కసుతో వైసీపీ చాలాకాలంపాటు పోస్టింగ్ లేకుండా చేసిందని, చివర్లో ఇచ్చిందని, కూటమి అధికారం చేపట్టిన తర్వాత సొంత మనిషిగా భావించి తనకు నగరంలో పోస్టింగ్ కొనసాగించాలని కోరుతున్నట్టు సమాచారం. అదేవిధంగా ఎన్నికల కోడ్ కారణంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిపోయిన సీఐలు, తహసీల్దార్లు తిరిగి నగరం, జిల్లా పరిధిలో పోస్టింగ్‌లు దక్కించుకునే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు కనీసం తమ వైపు చూడడానికి ఇష్టపడని అధికారులు ఇప్పుడు అదేపనిగా తమతో మాట్లాడేందుకు యత్నిస్తుండడం చూసి తెలుగుదేశం, జనసేన నేతలు ఆశ్చర్యపోతున్నారు.

'ఇబ్బందులకు గురిచేస్తే సహించం'

ఉక్కుటౌన్‌షిప్, మే 31 : కార్మికుల సంక్షేమంపై పోరాటం చేస్తామని, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో శుక్రవారం మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రస్తుతం విపత్కర పరిస్థితులున్నాయని, దీనివల్ల భవిష్యత్‌లో ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. అటువంటిది జరగకుండా ఇంటక్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. ప్లాంట్‌లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉం దని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్లాంట్ విషయంలో కేంద్రం నిర్ణయం సరికాదన్నారు. కారు రమణ, బీఎస్ రాజు, కొవిరి అవతారం, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌పి నాయుడు, సాహు, లోకేష్ పాల్గొన్నారు.

నేడు వినాయక ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, మే 31: జీవీఎంసీ 85వ వార్డు పెద మడకలోని అయ్యప్ప సుబ్రహ్మణ్య సహిత సంపత్ వినాయక ఆలయం 25వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి మోటూరి వెంకటరమణ తెలిపారు. వేడుకలను పురస్కరించుకొని స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి, వెండి కవచధారణ, ప్రత్యేక హారతి నిర్వహిస్తామన్నారు. ఈ కార్య క్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభం

కూర్మన్నపాలెం, మే 23: జీవీఎంసీ 86వ వార్డు శాతవాహన నగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీధర్‌స్వామి, కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీరామ్, శ్రీహనుమాన్ నామ స్మరణతో ఆలయ ఆవరణ మార్మోగింది. కార్యక్రమంలో కాట్రగడ్డ దుర్గా ప్రసాద్, బంద్రెడ్డి శేషగిరిరావు, మేకా శ్రీనివాసరావు, సాయిరాం, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మే 31: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడి స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 28 ఏళ్ల లోపు యువతకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు 9121999654 నంబర్‌ను సంప్రతించాలన్నారు

ప్రసన్నగిరి అభివృద్ధికి విరాళం



ఆలయ ప్రతినిధికి చెక్కు ఇస్తున్న ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం, మే 31: బీహెచ్‌పీవీ ప్రసన్న గిరిపై ఉన్న వెంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం అభివృద్ధికి నాతయ్యపాలెంకు చెందిన వ్యాపారవేత్త గోపిశెట్టి ఆదినారాయణ ఏడున్నర లక్షల రూపాయలు విరాళం అందజేశారు. శుక్రవారం దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో పాలక మండలి ఛైర్మన్ గంద్రెడ్డి రామునాయుడికి ఈ చెక్కును ఇచ్చారు.

నేడు హనుమజ్జయంతి

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 31: జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే, 90వ వార్డు కాకానీనగర్‌లో ఈశ్వరాలయం ప్రాంగణంలో ఉన్న వీర హనుమాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై వెలసిన శ్రీ కల్యాణ వెంకటేశ్వరాలయం ప్రాంగణంలోఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆల యంలో ఘనంగా హనుమాన్ జయంతి పురస్కరించుకుని పంచామృతాభిషేకం, హనుమాన్‌చాలిసా పారాయణం నిర్వహించనున్నట్టు అర్చకుడు శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వేపగుంట వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహిస్తారు.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 34, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 32, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 18,కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 18, క్యారెట్ 34, దొండకాయలు 20,బంగాళదుంపలు 27, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 160, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరు చిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 38, కీరదోస 22, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్రప్రెం డలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

ప్రమాదాల నివారణకు చర్యలు

పోలీసు కమిషనర్ రవి శంకర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

గాజువాక, మే 31 : ట్రాఫిక్ స్ట్రక్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా షీలానగర్ నుంచి పాతగాజువాక వరకు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నగర పోలీసులు శ్రీకారం చుట్టారు. ఈమేరకు శుక్రవారం గాజువాకలో ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ రవి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. నగరంలో ప్రతిరోజూ ప్రమాదాలు జరగడం బాధాకరమైన విషయమన్నారు. ఎన్‌జీవోలతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలపై చర్చించామని చెప్పారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ముందుకు వచ్చి ట్రాఫిక్ సమస్యల నివారణకు ట్రాఫిక్ కమాండోస్‌ను దత్తత తీసుకుందన్నారు. అడిషనల్ సీపీ ఫకీరప్ప మాట్లాడుతూ ట్రాఫిక్ స్ట్రక్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడుతుందన్నారు. విశాఖను ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ రాజీవ్‌కుమార్, ఏడీసీపీ (ట్రాఫిక్) జి. శ్రీనివాసరావు, సౌత్ ఏసీపీ టి. త్రినాథ్, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అభిమానులు

ఘనంగా సినీ నటుడు కృష్ణ జయంతి

పెదగంట్యాడ, మే 31 : ప్రముఖ సినీ నటుడు కృష్ణ 81వ జయంతి వేడుకలు శుక్రవారం సీతానగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు నమ్మి అప్పారావు మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమలో కృష్ణకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. సినిమాలకు సంబంధించి ఆయన పలు ప్రయోగాలు చేసి విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నక్క వెంకటరమణ, నమ్మి అప్పలనాయుడు, నంబారు కనకరాజు, చట్టి చిన్నారావు, మొల్లి సింహాచలం, నమ్మి వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు రొట్టెలు, పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

'కార్మికులకు వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు'



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం, మే 31 : ఉక్కు కార్మికులను యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వేతనాలివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న 1205వ రోజు రిలే దీక్షలో మాట్లాడారు. ప్రతినెల 7వ తేదీలోపు కార్మికులకు వేతనాలు ఇవ్వాలని చట్టం చెబుతుందని, కానీ చట్టాన్ని, నిబంధనలను ఉక్కు యాజమాన్యం పక్కన పెట్టిందన్నారు. సమయానికి వేతనాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి. ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే కార్మికులకు వేతనాలు ఆలస్యంగా ఇచ్చేందుకు యాజమాన్యం చేస్తుందన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు రామస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగాలను ప్రశ్నార్థకంగా చేస్తూ దుర్మార్గ పాలన అందించే బీజేపీ ప్రభుత్వానికి నూకలు చల్లే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ నాయకులు ఇప్పటికే గ్రహించారన్నారు. ఈ దుర్మార్గ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న న్యూపోర్టు సీఐ దాలిబాబు

పెదగంట్యాడ, మే 31 : రౌడీ షీటర్లలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని న్యూపోర్టు శాంతి భద్రతల విభాగం సీఐ దాలిబాబు హెచ్చరించారు. 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా శుక్రవారం ఆయన పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 30 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ దృష్ట్యా ఆంక్షలు కఠినంగా ఉన్నాయని, ఎవరూ వాటిని అతిక్రమించేందుకు ప్రయత్నించవద్దన్నారు. రాజకీయాలకు సంబంధించిన గొడవలు, అల్లర్లు వంటి వాటిలో తల దూరిస్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. అల్లర్లలో ఉన్నట్టు గుర్తిస్తే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ తేదీకి ముందు రోజు నుంచి కౌంటి ముగిసిన తరువాత ఒక రోజు తమ కదలికలన్నీ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని చెప్పారు. అలాగే తాము ఎప్పుడు ఫోన్ చేసినా వెంటనే స్టేషన్‌కు రావాలన్నారు.

పాఠశాలలను తెరిస్తే చర్యలు

కూర్మన్నపాలెం, మే 31 : అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో పాఠశాలలను ఎవరూ తెరవరాదని, తెరిచినట్టు సమాచారం వస్తే ఆ స్కూలు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ సునీత హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని యాజమాన్యాలు పాఠశాలలను తెరుస్తున్నట్టు సమాచారం ఉందని, విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే వారిదే బాధ్యత అని చెప్పారు.

వాంబే కాలనీలో కార్డెన్ సెర్చ్

మధురవాడ, మే 31 : ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాంబేకాలనీలో మూడు బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

కాలనీలో ఇంటింటికి వెళ్లి సోదాలు చేశారు. ఎలాంటి గుర్తింపు పత్రాలు లేని 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ లక్ష్మీనారాయణ, నార్త్ ఏసీపీ సునీల్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు నేపథ్యంలో అన్నిచోట్లా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 3 నుంచి 5వ తేదీ వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఆ మూడు రోజులు మద్యం దుకాణాలు కూడా సెలవు అని చెప్పారు. పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లయ్యపాలెం, ఎండాడ, మారికివలస, ఆర్‌హెచ్ కాలనీ, వాంబే కాలనీ సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, కౌంటింగ్ రోజున వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. ఈ సోదాల్లో పీఎంపాలెం సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు సునీత, సురేష్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దలకు వత్తాసు... పేదలపై ప్రతాపం

- ▸ చినముషిడివాడలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- ▸ చర్యలపై రెవెన్యూ యంత్రాంగం వివక్ష
- ▸ గర్భిణి ఆత్మహత్యాయత్నంపై ఉన్నతాధికారుల ఆరా

పెందుర్తి, మే 31: చినముషిడివాడ ఆక్రమణలకు అడ్డా మారుతోంది. ఇక్కడ పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు పరాధీనమవుతున్నాయి. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన పెద్దలే ఆక్రమణలకు పాల్పడుతుండడం విశేషం. రెవెన్యూ అధికారులు మాత్రం పేదలపైనే కఠినంగా వ్యవహరిస్తున్నారు. పెద్దల విషయంలో మిన్నకుంటుండడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే మూడురోజుల కిందట చినముషిడివాడలో షెడ్డు తొలగింపులో రెవెన్యూ అత్యుత్సాహం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఓ గర్భిణీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఘటనపై ఆ శాఖ ఉన్నత అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇదే ప్రాంతంలో రహదారి కిరువైపులా ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇటీవల భారీ భవన నిర్మాణాలు చేపట్టినా వాటి జోలికి వెళ్లకుండా ఎక్కడో శివారున కొద్దిపాటి స్థలంలో ఏర్పాటుచేసిన షెడ్డును కూల్చేందుకు సిబ్బంది సిద్ధపడడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పెద్ద లు ఆక్రమించిన స్థలాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఓ వీఆర్వో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆయనపై అధికారులు దృష్టి పెట్టినట్టు తెలిసింది. గతంలో చినముషిడివాడ ప్రధాన రహదారి సమీపంలోని సచివాలయం వీఆర్వో సస్పెన్షన్‌కు గురవడంతో ఇక్కడి సచివాలయ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా ఇదే వీఆర్వోకి అప్పగించడం అతని ఆగడాలకు హద్దు లేకుండా పోతుందన్న మాట వినిపిస్తోంది. ఆయన తీరుతోనే గర్భిణి పెట్రోల్‌పోసుకునే ఘటనకు దారి తీసినట్టు తెలిసింది. రెవెన్యూ ఉన్నత శాఖాధికారులు చినముషిడివాడ ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ఈరెం డు సచివాలయ పరిధిలో గల ఏమేరకు ప్రభుత్వ ఆ క్రమణకు గురైంది? ఎన్ని అక్రమణ నిర్మాణాలయ్యాయి అన్న కీలక సమాచారాన్ని ఉన్నతాధికారులు సేకరిస్తున్నట్లు తెలిసింది, ఎన్నికల కౌటింగ్ అయిన తరువాత ఈప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సర్వే నిర్వహించనున్నట్టు తెలిసింది. ఈక్రమంలో ఇటీవల నరవ, గవరజగ్గయ్యపాలెం, సత్తివానిపాలెం, వేపగుంట, చినముషిడివాడ పరిధిలోని సచివాలయ వీఆర్వోలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి మెమోలు, కొంతమందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీంతో రెవెన్యూ వర్గాల్లో గుబులు రేపుతుంది.



చినముషిడివాడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రహదారి (ఫైల్‌ఫొటో)

ఈ ఆక్రమణలపై చర్యలేవీ?

చినముషిడివాడలో సప్తగిరినగర్ సమీపంలో కొంతమంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారు. చినముషిడివాడలో బీఆర్టీఎస్ రహదారి స్థలంలో సుమారు 10 సెంట్లు ఆక్రమించి భారీ నిర్మాణాలు జరిగినట్టు ఇటీవల రెవెన్యూ సర్వేలో నిర్ధారించి నోటీసులు అందజేసినా చర్యలు లేవు. చినముషిడివాడ జోగులాంబ బస్టాప్ వద్ద ప్రభుత్వ స్థ లాన్ని ఆక్రమించి అధికార పార్టీ నేత ఒకరు తన లే అవుట్‌కు దర్జాగా రహదారి ఏర్పాటుచేసుకున్నారు. ఇందులో భాగంగా తన ప్లాటు ఆక్రమణకు లోనవుతుందని ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. శారదాపీఠం మార్గంపోర్టు కళ్యాణ మండపం సమీపంలోని గెడ్డ స్థలాన్ని ఆక్రమించి చేపట్టినా కనీస చర్యలు తీసుకోలేదు.

భీమిలిలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

భీమునిపట్నం, మే 31 : బీచ్‌రోడ్ తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్‌లో శుక్రవారం నుంచి రాష్ట్ర స్థాయి 9వ రగ్బీ జూనియర్ బాల, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జీవీఎంసీ డెప్యూటీ మేయరు జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రగ్బీ పోటీలో విద్యార్థులు వేగవంతంగా పట్టుదలతో తర్ఫీదు పొందుతూ, ఉత్సాహవంతంగా పాల్గొంటున్నారన్నారు. క్రీడాకారులు మంచి నైపుణ్యతతో వివిధ పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తొలుత ఆయన 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కాగా బాలికల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌కు అనంతపురం, కర్నూల్, ప్రకాశం, తూర్పు గోదావరి, గుంటూరు జట్లు చేరాయి. బాలుర విభాగంలో నెల్లూరు, కర్నూలు, గుంటూరు, శ్రీకాకుళం, ప్రకాశం, తూర్పుగోదావరి జట్లు చేరాయి. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని రగ్బీ జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్ తెలి పారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి. రామాంజనేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిషోర్, సురేష్, తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీధర్

ఫలితాల రోజు అల్లర్లు సృష్టిస్తే చర్యలు

▸ **సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు**

పెందుర్తి, మే 31: ఎన్నికల ఫలితాల ప్రకటించిన సమయంలో ఎవరైనా అలజడులు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. రాజకీయ పార్టీలు వివాదాలకు పోకుండా సంయమనం పాటించాలన్నారు. ఈ నెల 4న ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం చినముషిడివాడలో రాజకీయ నేతలతో సమావేశాన్ని నిర్వహించారు ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ (సెబ్) శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం 144 సెక్షన్ పక్కాగా అమలవుతోందన్నారు. ఫలితాల రోజు సంబరాలు, ర్యాలీలు, బాణసంచా కాల్పులు చేపట్టరాదన్నారు. గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత కోసం స్టైకింగ్ ఫోర్స్ పోలీసులు పహారా ఉంటుందనారు. ఈక్రమంలో ఎవరైన హద్దుమీరితే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. ఎన్నికల ఫలితాలతో పంతాలకుపోయి కక్షలకు దిగితే చర్యలు తప్పవన్నారు. అంతా కుటుంబంలా వ్యవహరించి, సహకరించాలని కోరారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఫలితాల్లో రెచ్చగొట్టేలా మాట్లాడవద్దన్నారు. హింసాత్మక సంఘటనలు సీఐ రాంపురంలో బంధువుల మధ్య గెలుపుపై వాట్సాప్‌లో సందేశం వివాదంగా మారడంతో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ అసరి తాత, వెంకట్ పోలీసు సిబ్బంది వివిధ రాజకీయ పార్టీ నేతలు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ శ్రీనివాసరావు

పెందుర్తి నియోజవర్గం ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆర్వో శేషశైలజ తెలిపారు. పెందుర్తి జిల్లా సమాఖ్య కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీల నేతలో సమావేశం నిర్వహించారు. కౌటింగ్ ప్రాంతంలో ఏజెంట్లు సామరస్యంతో మెలగాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ జరుగుతుందన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు

చంద్రబాబును కలిసిన పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 31 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును గాజువాక మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు శుక్రవారం హైద రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లా విశాఖలో అసైన్డ్ భూముల కుంభకోణంలో సీఎస్ జవహర్‌రెడ్డి పాత్ర గురించి చంద్రబాబుకు వివరించారు. జీవో రాకముందే రైతులను బెదిరించి జవహర్‌రెడ్డి అండ్ కో ఒప్పందాలు చేసుకున్నారని, డిసెంబరులో జీవో వస్తే పది రోజుల్లోనే రిజిస్ట్రేషన్ ప్రారంభించారని, దీనికి జిల్లా అధికారులు కూడా సహకరించారని తెలిపారు. ఫలితాల అనంతరం తనకు ఎటువంటి బాధ్యత అప్పగించినా చిత్త శుద్ధితో నిర్వహిస్తానన్నారు.

పుస్తక విక్రయ కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌జేడీ



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్, డీఈవో చంద్రకళ

ఆటోనగర్/గాజువాక మే 31 : ఆటోనగర్‌లో ఉన్న జిల్లా పుస్తక విక్రయ కేంద్రాన్ని ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 46 మండలాలకు చెందిన పాఠశాల లకు ఇక్కడి నుంచే పుస్తకాలు సరఫరా చేస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 1 నుంచి 7వ తరగతి వరకూ 21,71,180 పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉండగా మొదటి విడతగా 8,62,606 పుస్తకాలు వచ్చాయని, గతేడాది సుమారు 2 లక్షలు మిగిలి ఉండడంతో, మొత్తం పుస్తకాలు 10,62,606ను ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో అనతి కాలంలోనే పుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు.వారితో పాటు డిపో డీఎం శ్రీనివాస్, అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సంతోష్ ఉన్నారు.

అధ్వానంగా ఇ-మర్రిపాలెం-పెదముషిడివాడ రోడ్డు



గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి

అగనంపూడి, మే 31 : జీవీఎంసీ 85వ వార్డు ఇ-మర్రిపాలెం నుంచి పెద ముషిడివాడ వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దీన్ని బీటీ రోడ్డుగా నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. రహదారి పొడవునా పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతు న్నారు. 20 ఏళ్ల కిందట అప్పటి పంచాయతీ నిధులతో మట్టి రోడ్డు నిర్మించారు. పదేళ్ల క్రితం జీవీఎంసీ నిధులు వెచ్చించి ఇ-మర్రిపాలెం నుంచి కొంతమేర బీటీ రోడ్డు నిర్మించారు. మరో 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది.ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు వినతులు ఇస్తున్నా.. స్పందన ఉండడం లేదు.

మేహాద్రిలో విదేశీ విహంగాల కనువిందు



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో సేద తీరుతున్న విదేశీ విహంగాలు

గోపాలపట్నం, మే 31: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ పరీవాహక ప్రాంతాల్లో విదేశీ విహంగాలు కనువిందు చేస్తున్నారు. ఏటా వేసవిలో ఇవి వస్తుంటాయి. గత మార్చి నుంచి రిజర్వాయర్ కాలువ ప్రవహించే శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. కొత్తపాలెం, నరవ, కోటనరవ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, నీటి మడుగుల్లో ఎక్కువగా కనిపించడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారిలో కోటనరవ కూడలి వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం చెరువులో నీరు అడుగంటింది. దీంతో పెద్ద సంఖ్యలో చేపల వేట సాగిస్తున్నాయి. పక్కనున్న చెట్లపై ఆవాసం ఏర్పాటుచేసుకుంటున్నాయి.

18న మోదకొండమ్మ అమ్మవారి పండగ




ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం, మే 31: స్థానిక ఇందిరానగర్‌లోని మోదకొండమ్మ అమ్మవారి పండగ మహోత్సవం జూన్ 18న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో పండగ సంబంధించిన పోస్టర్లు శుక్రవారం ఆవిష్కరించారు. పండగ పురస్కరించుకుని జూన్ 16న ఆలయం వద్ద పుట్టబంగారంతీత నిర్వహిస్తారు. 17న అమ్మవారి తొలేళ్ల ఉత్సవంలో ఘటాల ఊరేగింపు నిర్వహిస్తారు. మరుసటి రోజు తెల్లవారు జామున అమ్మవారికి విశేషాలంకరణగావించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శాంతినగర్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణం

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 30: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్కులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు నిర్మాణ పనులను డిప్యుటీమేయర్ జియ్యాని శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. నగరంలో భూగర్భ జలాలు పెంచేందుకు ఏపీఫెర్‌వాస్ సభ్యులు చేస్తున్న కృషిని కొనియాడారు. అలాగే, శాంతినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యుల చూపిస్తున్న చొరవను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫెర్‌వాస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌శ్రీనామి, కార్యదర్శి కె.ఎస్. ఆర్. మూర్తి జోన్ 5 జోనల్ కో ఆర్డినేటర్ కర్రి శేషగిరిరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, దామోదర్‌రావు, జి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో అఖిల్‌కు 4వ ర్యాంక్



భీశెట్టి అఖిల్

పెందుర్తిరూరల్, మే 31: ఏపీ ఈసెట్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో చింతలగ్రహారం విద్యార్థి భీశెట్టి అఖిల్ రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ (149 మార్కులు) సాధించాడు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ కోర్సు చదివిన అఖిల్ భవిష్యత్తులో కెమికల్ ఇంజనీరింగ్ అవుతానన్నారు. తల్లి రమ గృహిణి, తండ్రి. జగదీశ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


అలంకరణలో అమ్మవారు

పూర్ణామార్కెట్, మే 31: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో జరిపిన ఈ పూజల్లో 10 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. అనంతరం పసుపు, కుంకుమ, పూలతో విగ్రహాన్ని అలంకరించి అర్చకులు పూజలు చేశారు. ప్రతీ శుక్రవారం జరిగే క్షీరాభిషేకసేవల్లో పాల్గొన దలచిన భక్తులు 500 రూ. టిక్కెట్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సహాయ కార్యనిర్వహణాధికారి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


నేతాజీ వంతెనపై ఏర్పాటు చేసిన పూల మొక్కలు

జ్ఞానాపురం,మే 31: జ్ఞానాపురం నేతాజీ వంతెనపై సంరక్షణ లేక ఎండిపోయిన మొక్కల స్థానంలో జీవీఎంసీ ఉద్యానవన శాఖ అధికారులు కొత్తవినాటారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'మూన్నాళ్ల ముచ్చటగా అభివృద్ధి పనులు' శీర్షికన వచ్చిన కథనానికి ఉద్యానవన శాఖ అధికారులు స్పందించారు. వంతెనపై మొక్కలు నాటారు. దీంతో పాదాచారులు, వాహనదారులు హర్షం వక్తం చేశారు.

సంగీత విభావరి రేపు

డాబాగార్డెన్స్, మే 31: మెలోడి క్రియేటర్స్ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం కార్యక్రమ గోడపత్రికను సెంచూరియన్ యూనివర్సిటీ గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కె.వీరస్వామి, వివిధ సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

చలివేంద్రాలు సరే.. నీరందించే వారేరీ?

» జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో ఖాళీగా పందిళ్లు

» తీరని పాదచారులు, వాహనదారుల దాహార్తి


జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కానరాని పనివారు



గాంధీ విగ్రహం వద్ద ..

డాబాగార్డెన్స్, మే 31: గ్రేటర్ 31వ వార్డులోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో వేసవి నేపథ్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాల వద్ద కనీసం నీటిని అందించేందుకు ఎవరూ లేకపోవడంతో దాహార్తితో వచ్చేవారు గగ్గోలు పెడుతున్నారు. వాతావరణ మార్పులతో ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద, జీవీఎంసీ కార్యాలయ పరిసరాల్లో నిత్యం ప్రజలు తాకిడి అధికంగా ఉంటోంది. వృద్ధులు, వికలాంగలు, విద్యార్థులు అటుగా రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు సదరు ప్రాంతాలనుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సైతం వస్తుంటారు. ఈ నేపథ్యంలోని తాగేందుకు చలివేంద్రాలున్నా వాటి వద్దకు తీరా వెళ్తే ..కనీసం అక్కడ మనుషులు లేకపోవడంతో నిరాశతో పలువురు వెనుతిరిగివెళ్లిపోతున్నారు. జీవీఎంసీ ఏర్పాటుచేసిన సంబంధిత వ్యక్తులు అక్కడ ఉండకుండా చలివేంద్రాలను గాలికి వదిలేస్తున్నారు. దీంతో దాహం తీరే మార్గంకానరాక పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రస్థాయి తపాలా శాఖ అధ్యక్షుల సదస్సు


అవార్డులు ప్రదానం చేస్తున్న ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్స్ జనరల్ ప్రకాష్

సాగర్‌నగర్, మే 21 : రుషికొండ సాయిప్రియా రిసార్ట్స్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి తపాలా శాఖ అధ్యక్షుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్స్ జనరల్ కె. ప్రకాష్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో తపాలా శాఖ ప్రగతికి కృషి చేసిన 182 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ పోస్టల్ సిబ్బందిని ప్రోత్సహించడానికి, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విశాఖపట్నం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా మాట్లాడుతూ విశాఖపట్నం పోస్టల్ డివిజన్ వివిధ విభాగాల్లో 11 అవార్డులు కైవసం చేసుకుందన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్ ఎక్స్‌పో


రుణాలకు సంబంధించి చెక్ అందిసున్న బ్యాంక్ అధికారులు

సీతంపేట, మే 31: ప్రముఖ ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆ ధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో శుక్రవారం రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నగరంలోని ప్రముఖ బిల్డర్స్, వాహన డీలర్స్ విద్యా రుణాల ఏజన్సీలు పాల్గొని వారి వాణిజ్య విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ షాలిని మీనన్, ఉప జోనల్ మేనేజర్ శంకర్ హేమ్‌రామ్, రీజనల్ మేనేజర్ నరసింహ కుమార్ పాల్గొని బ్యాంక్ పరిధిలో రిటైల్ రుణాలకు సంబంధించి వివరించారు. ఈ రుణాల సదావకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు: సీఐ


మెట్టు వద్ద దుకాణాలను తొలగిస్తున్న పోలీస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం, మే 31 : పుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్డులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు పుట్‌పాత్‌లపై ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాదరావు మాట్లాడుతు.. రోడ్లపై ఇష్టానుసారం వ్యాపారాలు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలించడం తగదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తామన్నారు. కంచరపాలెం మెట్టు నుంచి మర్రిపాలెం జంక్షన్ వరకు నిత్యం ప్రత్యేక ట్రాఫిక్ బీట్‌ను ఏర్పాటు చేసి ఆక్రమణదారులపై చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ.బాలరాజు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గోవింద్, సత్తిబాబు,సిబ్బంది పాల్గొన్నారు.

కళలు మన సంస్కృతికి ప్రతిబింబం


నృత్య కళాకారిణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 31: కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో స్నేహాంజలి ఆర్ట్స్ అసోసియేషన్, నృత్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్యాన్సస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ సభ్యుడు డా.విశ్వకర్మ డీఆర్‌కే, కళా ప్రపూర్ణ డా.జాలాది విజయ, మలేషియాకు చెందిన రాయవరపు శ్రీదేవి, స్నేహాంజలి ఆర్ట్స్ డైరెక్టర్ శైలజమూర్తి హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మోహితపల్, ఇందిర పరుశురాం, డి.ఆర్.కె.సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పొగాకు ఉత్పత్తుల నిషేధం కఠినతరం చేయాలి

» లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు


పూరాతన ధూమపాన వస్తువులు, వివిధ రకాల యాష్‌ట్రేల పరిశీలిస్తున్న వైద్యులు


కేజీహెచ్‌లో వైద్య తనిఖీలు చేస్తున్న దృశ్యం

సీతమ్మధార, మే 31: జీవితంలో ఎంత ఎదిగామన్నది కాదని ఎంత ఆరోగ్యంగా ఉన్నామన్నది ముఖ్యమని లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ వి.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకుని సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో ధూమపానం నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినం ఒక్క రోజు కాదని నిరంతర ప్రక్రియగా పాటించాలని, తద్వారా తమ ఆరోగ్యంతోపాటు కుటుంబ సభ్యులు, ఎదుట వారి ప్రాణరక్షణకు కూడా దోహదపడాలన్నారు. ధూమపానం నిషేధంపై ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈసంర్భంగా పూరాతన ధూమపాన వస్తువులు, వివిధ రకాల యాష్‌ట్రేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, జేఆర్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ఆర్ మూర్తి, జీఎస్ శివప్రకాష్, బ్యాంకు సిబ్బంది, పలువురు ప్రముఖులు, ఇతర ఆసుపత్రుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నోటి కేన్సర్‌పై అవగాహన

మహారాణిపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా కేజీహెచ్‌లోని దంత వైద్య విభాగం లో నోటి క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాధిపతి వీవీఎస్ త్రివేణి ఆధ్వర్యంలో సుమారు 100మంది వెల్‌స్కోప్ అనే అధునాతన పరికరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. పొగాకు, గుట్కా, ఖైనీ, తంబాకు తదితర వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈసందర్భంగా మౌత్ వాష్‌లు, టూత్ పేస్టులు, కేన్సర్ మందులను రోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినోద్, లావణ్య, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఏబీ వెంకటేశ్వరరావు పోరాట స్ఫూర్తి భేష్'

సీతమ్మధార, మే 31: పోరాట స్ఫూర్తితో పదవీ విరమణ చేసిన డీజీ ర్యాంక్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకి మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు అభినందనలు తెలిపారు. ధైర్యాన్ని కోల్పోకుండా ఐదేళ్లపాటు వెంకటేశ్వరరావు పోరాడడం గొప్పవిషయమని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామారాజు ఏ విధంగా చేశారో.. ఆ స్ఫూర్తితో పోరాటం చేసిన వెంకటేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలిపారు. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ ఇలానే వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఎప్పుడో ప్రజా తిరుగుబాటు వచ్చేదన్నారు. వెంకటేశ్వరరావు నిండు నూరేళ్ల ధైర్యంతో వెళ్లాలని మనస్ఫు స్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

లక్ష్మీ వినాయక ఆలయం వద్ద అన్న సమారాధన


అన్నదానం ప్రారంభిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, మే 31 : నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. బాలానంద శివాచార్య స్వామి ఆశీస్సులతో 51 రోజులపాటు నిర్విరామంగా బాటసారుల కోసం చలివేంద్రం నిర్వహించారు. ముగింపు సందర్భంగా దాతలు పి. అచ్యుత వంశీధర్ సహకారంతో 300 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాలానంద శివాచార్య స్వామి, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ సీపీ'

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ నుంచి సహాయం పొందాలనుకునేవారు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 0891-2523408కి ఫోన్ చేసి సమస్యను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని తెలి పారు. 12 నుంచి 12.30 వరకూ సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల నుంచి ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కారం

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన వారిని సీపీ రవిశంకర్ శుక్రవారం తన కా ర్యాలయంలో సత్కరించారు. సీటీసీ సీఐ ఎ. విశ్వేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ షేక్‌యూసఫ్, న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు, స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ ఆర్. మల్లేశ్వరరావు, పోర్ట్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.గంగాధరరావు, కంచరపాలెం ట్రాఫిక్ ఏఎస్ఐ ఎ. లక్ష్మణరావు, వన్‌టౌన్ ట్రాఫిక్ ఏఎస్ఐ కె.సత్యనారాయణ, పీఎంపాలెం క్రైమ్ ఏఎస్ఐ వి.సత్యారావు ఉద్యోగ విరమణ చేయడంతో వారందరినీ, కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ సన్మానించారు.

పాలీసెట్‌లో 374మంది ధ్రువపత్రాల పరిశీలన

కంచరపాలెం, మే 31 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్, పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన పాలీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 374 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు. రెండు హెల్ప్ లైన్ కేంద్రాల్లో 184 చొప్పున విద్యార్థులు హాజరయ్యారు.

అన్నవరం భూములపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

నేతలు, కొందరు రౌడీలు వచ్చారంటున్నారు. పది రోజుల క్రితం జవహర్‌రెడ్డి అన్నవరం వచ్చారని, ఆ తరువాత త్రిలోక్ అనే వ్యక్తి భోగాపురం పరిసరాల్లో తిరుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ తీసుకోగా మిగిలిన భూమిని తమకు అమ్మాలని పెద్దలు ఒత్తిడి తీసుకువస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. చావో రేవో తేల్చుకోకపోతే భూములు పోతాయని గుర్తించి పోరాటానికి సిద్ధమైన రైతులు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

6వతేదీ వరకు114 సెక్షన్ అమలు

» కలెక్టర్ మల్లికార్జున



మహారాణిపేట, మే 31: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఈ నేపథ్యంలో జూన్ 4 వ తేదీన రాజకీయ పార్టీలు ఎట్టిపరిస్థితుల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ మల్లికార్జున స్పష్టంచేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుం దన్నా రు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం తరపున ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని లెక్కింపు కేంద్రాలలో పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని హెచ్చరించారు. ఈ ప్రక్రియను శాంతి యు తంగా పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 3వతేదీనుంచి 6తేదీవరకు 144వ సెక్షన్ విధించినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలలో ఐదుగురు కంటే ఎక్కువ మంది ఉండరాదన్నారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి బహిరంగంగా ప్రదర్శించకూడదన్నారు. లౌడ్ స్పీకర్లు వినియో గించకూడదని చెప్పారు. గెలుపొందిన అభ్యర్థి ధ్రువీకరణపత్రం స్వీకరిం చటానికి ఆయనతో పాటు కేవలం ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి వాహనాలకు అనుమతి లేదన్నారు. హాల్ లోనికి రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఐడీ కార్డు చూపిన వారికి మాత్రమే అనుమతి ఉంటుం ద న్నారు. మొబైల్ ఫోన్ తీసుకు రావటానికి వీలు లేదని తెలిపారు

తాళ్లవలసలో మందుగుండు సామగ్రి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

భీమునిపట్నం (రూరల్) మే 31 : మండలంలోని తాళ్లవలస పీహెచ్‌సీ సమీపంలో అక్రమాని చిన్నమ్మలు ఇంటి పక్క నున్న రేకుల షెడ్‌లో గురువారం రాత్రి విశాఖ టాస్క్‌ఫోర్సు పోలీసులు భారీ ఎత్తున మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్సు ఎస్ఐ భరత్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. భీమిలికి చెందిన కొక్కిరి అప్పన్న అక్కడ మందుగుండు అమ్మకాలు చేస్తున్న విషయాన్ని గమనించి అతనికి రెండు మూడుసార్లు హెచ్చరికలు జారీ చేశామన్నారు. దీంతో ఆయన తన స్థావరాన్ని తాళ్లవలసకు మార్చినట్టు చెప్పారు. దాడిలో వెయ్యి తారాజువ్వలు, వెయ్యి పుల్లలు లేని తారాజువ్వలు, బెల్టు బాంబులు, నీటి బాంబులు, సీమ టపాకాయలు 50 బస్తాలు, తౌజండ్ వాలా బాంబులు 500, 15 సంచులతో రాకెట్ బాంబులు, బస్తా సిల్వర్ ప్లేట్ బాంబులతో పాటు ఆరు గోనె సంచులతో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిని విజయనగరం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలో నిల్వ చేసి సరఫరా చేస్తున్నార న్నారు. ఎన్నికల ఫలితాల తరువాత గెలుపొందిన అభ్యర్థుల మద్దతుదారులకు అమ్మకాలు చేయడానికి వీటిని నిల్వ చేసినట్టు చెప్పారు. ఈమేరకు అప్పన్నను అరెస్టు చేసి, భీమిలి పోలీసులకు అప్పగించామని తెలిపారు.

సిద్ధాంజనేయునికి పంచామృతాభిషేకం

మురళీనగర్, మే 31 ; ఊర్వశిజంక్షన్ పాలిటెక్నిక్ కాలేజీ సమీపాన సూర్యానగర్-2 శ్రీ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు, అష్టోత్తర శత కలశస్నపనం నిర్వహించారు. సామూహిక సుందరకాండ పారాయణ జరిపారు. ఉదయం ఆంజనేయునికి తమలపాకుల అర్చన, సింధూర అర్చనలు నిర్వహించారు.మూడు రోజులపాటు ఉత్సవాల్లో జూన్ 1న శనివారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక అలంకరణలో స్వామి వారి దివ్య దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స సుబ్బరాజు తెలిపారు. మాధవధార జంక్షన్, బర్మాకాలనీ హనుమాన్ ఆలయాల్లో శనివారం జయంతి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

భారీగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

పందాలు కాసిన ఎంతోమంది ఇప్పుడు సైలెంట్ అయి పోయారు. కూటమి అభ్యర్థి తరపున అధిక మొత్తాన్ని ఇస్తామని ఆఫర్ చేస్తున్నా వైసీపీ నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ జిల్లాలోని ఎస్.కోట, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలపై భారీగా పందాలు సాగుతున్నాయి.

కీలక స్థానాల్లో మెజారిటీపైనా..

రాష్ట్రంలో కీలక నియోజక వర్గాల్లో అభ్యర్థులు సాధించే మెజారిటీపైనా పెద్దఎత్తున పందాలు సాగుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ మెజారిటీలపై జోరుగా పందాలు సాగుతున్నాయి. వీరి ముగ్గురిలో ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తుందన్న దానిపైనా బెట్టింగ్ జరుగుతోంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ కనీసం 30 వేలకుపైగా మెజారిటీ సాధి స్తారంటూ పందాలు కడుతున్నారు. అలాగే జనసేన పోటీ చేసిన స్థానాల్లో సగానికిపైగా గెలుచుకుంటుందని, రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, వైసీపీ లభించే ఎంపీ స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. కడపలో అవినాష్‌రెడ్డి గెలుపు/ఓటమి, మెజారిటీపై కూడా పందాలు సాగుతున్నాయి.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

గతంలో ఎన్నడూ పందాలు గురించి పట్టించుకోని ఎంతో మంది ఈసారి బెట్టింగ్‌కు ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం. వీరిలో చిన్న, పెద్ద అంతా ఉన్నారు. రూ.5 వేల నుంచి రూ.కోటి, అంతకు మించి పందాలు సాగుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల బెట్టింగ్ జరిగినట్టు చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఏపీలో జగన్ మరోమారు అధికారంలోకి వస్తారంటూ బెట్టింగ్ కడుతుండగా, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు కూటమి వైపు పందాలు కాస్తున్నారు. ఈసారి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా బెట్టింగ్‌లో భాగస్వామ్యులు కావడం గమనార్హం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూటమి గెలుస్తుందంటూ భారీ మొత్తంలో బెట్టింగ్ కట్టారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

... 5వ పేజీ తరువాయి

ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా గ్రామంలో పేదలకు సొంత ఇళ్ల నిర్మాణాల కోసం 164-3లో 1.53 ఎకరాలను కేటాయించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించడంతో ఆనందపురం రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం 57 మంది పేదలకు సెంటున్నర వంతున (72 గజాలు) ఇచ్చేందుకు నిర్ణయించారు. ప్లాట్లకు 84 సెంట్లు, రోడ్లకు 42 సెంట్లు, ఓపెన్ స్పేస్‌కు మిగిలిన భూమి కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్లాట్ల కోసం భూమిని చదునుచేశారు. అయితే ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగడంతో ఆ ప్రాంతమంతా తిరిగి పొదలు, చెట్లు పెరిగాయి. ఇదిలావుండగా డీపట్టా భూములకు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇస్తున్న నేపథ్యంలో భూములు కొనుగోలు చేస్తున్న బడాబాబులు రామవరంపై కన్నేశారు. పెద్దల సిఫారసు మేరకు పట్టా భూములకు జిల్లా అధికారులు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు ఇస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 26వ తేదీన ఇచ్చిన ప్రొసీడింగ్స్‌లో పేదల ఇళ్లకు కేటాయించిన సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాల భూమి ఉంది. గతంలో పట్టా రద్దు చేసి స్వాధీనం చేసుకుని...తరువాత ఇళ్ల కోసం కేటాయించిన భూమికి ఎలా ఫ్రీ హోల్డ్ అనుమతులు ఎలా ఇచ్చారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారిస్తే అనేక అక్రమాలు వెలుగులోకి వస్తాయని రామవరం గ్రామస్థులు అంటున్నారు.

పోస్టింగ్‌ల కోసం అప్పుడే పైరవీలు

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌స్థాయి అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. నగర పోలీస్ కమిషనర్‌గా కొన్నాళ్ల కిందట వరకూ పనిచేసిన అధికారి ఒకరు తిరిగి కమిషనర్‌గా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం ఆ శాఖలో జోరుగా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వం తనను అవమానకరంగా కొద్ది నెలలకే బదిలీ చేసిందని, తనకు తిరిగి ఇక్కడ పోస్టింగ్ ఇస్తే పోయిన పరువును దక్కించుకున్న సంతృప్తి ఉంటుందంటూ కూటమికి చెందిన నేతలను కలిసినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. అలాగే ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న అధికారి...తన కుటుంబ సభ్యులు టీడీపీ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేశారనే అక్కసుతో వైసీపీ చాలాకాలంపాటు పోస్టింగ్ లేకుండా చేసిందని, చివర్లో ఇచ్చిందని, కూటమి అధికారం చేపట్టిన తర్వాత సొంత మనిషిగా భావించి తనకు నగరంలో పోస్టింగ్ కొనసాగించాలని కోరుతున్నట్టు సమాచారం. అదేవిధంగా ఎన్నికల కోడ్ కారణంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిపోయిన సీఐలు, తహసీల్దార్లు తిరిగి నగరం, జిల్లా పరిధిలో పోస్టింగ్‌లు దక్కించుకునే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు కనీసం తమ వైపు చూడడానికి ఇష్టపడని అధికారులు ఇప్పుడు అదేపనిగా తమతో మాట్లాడేందుకు యత్నిస్తుండడం చూసి తెలుగుదేశం, జనసేన నేతలు ఆశ్చర్యపోతున్నారు.



అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మే 31 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీలు పట్టివేత



పోలీసు స్టేషన్ వద్ద ఉన్న లారీలు

పద్మనాభం, మే 31 : మండలంలోని పలు గ్రామాల్లో అనధికారికంగా మట్టి రవాణా చేస్తున్న లారీలకు గనుల శాఖ అధికారులు శుక్రవారం జరిమానా విధించారు. పొట్నూరు నుంచి ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తుండగా గనుల శాఖ అధికారులు మూడు లారీలను గురువారం రాత్రి పట్టుకొని సీజ్ చేసి, పద్మనాభం పోలీసులకు అప్పగించారు. ఒక్కో లారీకి రూ. 6200 చొప్పున రూ. 18600 జరిమానా విధించారు.

నేడు చిట్టివలసలో హనుమజ్జయంతి

తగరపువలస, మే 31 :చిట్టివలస జూట్‌మిల్లు రోడ్డులో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 5 నుంచి 12 వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పద్మనాభం :మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాలను శుభ్రం చేసి అలంకరించారు. పద్మనాభంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, సింధూరం, తమలపాకులతో సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. రెడ్డిపల్లి కృష్ణచంద్ర బాబాజీ మఠంలోని ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.సాయంత్రం పల్లకీ సేవ అనంతరం బైక్ ర్యాలీతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. అలాగే ఇసకలపాలెం, రేవిడి, మద్ది, చిన్నాపురం, పొట్నూరు, కోరాడ, పాండ్రంగి, బీఆర్ తాళ్లవలస, అయినాడ గ్రామాల్లోనూ వేడుకలకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశారు.

'లండ వంశీయులను పూజార్లుగా నియమించాలి'

సింహాచలం, మే 31 : అడివివరం గ్రామానికి చెందిన లండ వంశీయులను పైడితల్లెమ్మ, బంగారమ్మ ఆలయాల్లో పూజారులుగా నియమించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మఠ మందిర్ టోలీ పూడిపెద్ది శర్మ కోరారు. శుక్రవారం ఆయన ఈఓ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందించారు. అమ్మవార్ల వార్షిక ఉత్సవాల్లోనే కాకుండా ఇతర రోజుల్లోనూ లండవంశీయులకు విధులు కేటాయించాలన్నారు.

సినిమా గైడ్

● **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)

● **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)

● **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)

● **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 34, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 32, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 18, క్యారేట్ 34, దొండకాయలు 20, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 160, బరబటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 38, కీరదోస 22, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64,దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

అన్నవరంలో అన్నదాతల ఆందోళన

- తమకు న్యాయం చేయాలని డిమాండ్
- అధికారుల తీరుపై మండిపాటు

భీమునిపట్నం రూరల్, మే 31 : ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములను ప్రభుత్వం అన్యాయంగా ల్యాండ్ పూలింగ్ పేరుతో స్వాధీనం చేసుకుని తమకు ఉపాధి లేకుండా చేసిందని అన్నవరం గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో సర్వే నంబరు 101/1లో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. ఇందులో ఎంతో కాలంగా రైతులు డి.పట్టాలు పొంది సాగు చేసుకుంటున్నారు. నాలుగేళ్ల క్రితం సుమారు 95 ఎకరాలకు ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేసి రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకుంది. రైతులకు నష్టపరిహారంగా వేరే చోట భూములు కేటాయించింది. ఆ భూముల్లో డి.పట్టా రైతులు, జిరాయితీ రైతులు వేర్వేరుగా వున్నారు. ప్రభుత్వ అధికారులు మాత్రం రికార్డులపరంగా డి.పట్టా రైతులకు మాత్రమే నష్టపరిహారం అందజేశారు. సంబంధిత భూమిని రెవెన్యూ అధికారులు వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ భూములు అలాగే వున్నాయి.వాటిని రైతులు సాగు చేసుకుంటూనే వున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఒకసారి వుడా ఆ భూమిలో ఫెన్సింగ్ వేయడానికి వెళ్లగా రైతులు ప్రతిఘటించారు. కొన్ని ఫెన్సింగ్ పోల్స్‌ను కూడా తొలగించేశారు. గురువారం వుడా సంబంధిత భూమిలో మళ్లీ ఫెన్సింగ్ పోల్స్ వేయడానికి పోలీసు బందోబస్తుతో, రెవెన్యూ అధికారులతో వెళ్లింది. మళ్లీ రైతులు తమకు న్యాయం చేసిన తర్వాతే స్థలంలోకి అడుగుపెట్టాలని ఆందోళన చేపట్టారు. ఆఖరికి పోలీసు బందోబస్తుతో ఫెన్సింగ్ పోల్స్ వేశారు. ఈ విషయమై తహసీల్దార్ తాడ్డి గోవింద్ మాట్లాడుతూ 2020లో సంబంధిత డి.పట్టా రైతులందరూ ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించడం, నిబంధనల ప్రకారం వారికి ప్రత్యామ్నాయంగా ఎకరాకు 950 చ.గ.ములు అప్పగించామని చెప్పారు.

అయితే రైతుల భూముల్లో కొందరు జిరాయితీ రైతులు వున్నారని, వారికి డి.పట్టా రైతులకు చాలా వరకూ ఒప్పందాలు చేసుకున్నారని తెలిసిందన్నారు. మరో రైతు రికార్డుల ప్రకారం ఆ వ్యక్తికి 5 ఎకరాలు డి.పట్టా వుండగా, 11 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నానని, మొత్తం భూమికి నష్టపరిహారం అందివ్వాలని డిమాం డ్ చేస్తున్నారని చెప్పారు. మరో ఐదు ఎకరాలు కోర్టు లో కేసు వుండడంతో అటుగా తాము వెళ్లలేదన్నారు. ఏ రైతు వచ్చినా వారికి వివరిస్తామన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో పారాయణలు

సింహాచలం, మే 31 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయంగా సింహగిరి మెట్ల మార్గంలో ఉన్న సాక్షి ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రభాతారాధనలు చేసి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేసి, సుందరాకాండ సర్గను పారాయణలు చేశారు.

పుస్తక విక్రయ కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌జేడీ

ఆటోనగర్/గాజువాక మే 31 : ఆటోనగర్‌లో ఉన్న జిల్లా పుస్తక విక్రయ కేంద్రాన్ని ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 46 మండలాలకు చెందిన పాఠశాలలకు ఇక్కడి నుంచే పుస్తకాలు సరఫరా చేస్తామన్నారు.

ఈశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం

ఆనందపురం, మే 31 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ సహాయకుడిగా పని చేసిన ఈశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిపాలనా అధికారి సుమతి పేర్కొన్నారు. ఈశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీలో అధికారులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. అనంతరం పలువురు ఈశ్వరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గంగునాయుడు, షహనాజ్ సాధియా, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఉచిత యోగా శిక్షణ

ఆరిలోవ, మే 31 ; ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకూ ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణ ఉదయం 5-30 నుంచి 7 వరకు ఉంటుందని, ప్రముఖ యోగా గురువు బుడ్డిగ సత్యనారాయణ శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి గల వారు 9704547560 ఫోన్ నంబరును సంప్రతించాలని ఆయన సూచించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పణ



మంగళవాయిద్యాలతో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

సాగర్‌నగర్, మే 31 : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, అధికా రులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



కార్యక్రమంలో పాల్గొన్న జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్, తదితరులు

ఆరిలోవ, మే 31 : ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే వారికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ అన్నారు. సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ బత్తిల కృష్ణారావు పదవీ విరమణ కావడంతో శుక్రవారం జైలు సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సబ్ జైలర్‌గా ఉద్యోగం ప్రారంభించి డీఎస్‌గా ఎదిగిన కృష్ణారావు ఇతర ఉద్యోగులకు ఆదర్శమని చెప్పారు. ఆయన శేష జీవితం ఆనందమయంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ రవి కిరణ్, రాజమండ్రి, విశాఖ జైళ్ల సూపరింటెండెంట్లు ఎస్. రాహుల్, కిషోర్‌కుమార్, పాల్గొన్నారు.

వాంబే కాలనీలో కార్డెన్ సెర్చ్



కాలనీలో కవాతు చేస్తున్న పోలీసులు

మధురవాడ, మే 31 : ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాంబే కాలనీలో మూడు బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి సోదాలు చేశారు. ఎలాంటి గుర్తింపు పత్రాలు లేని 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ లక్ష్మీనారాయణ, నార్త్ ఏసీపీ సునీల్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు నేపథ్యంలో అన్ని చోట్లా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 3 నుంచి 5వ తేదీ వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఆ మూడు రోజులు మద్యం దుకాణాలు కూడా సెలవు అని చెప్పారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లయ్యపాలెం, ఎండాడ, మారికివలస, ఆర్‌హెచ్ కాలనీ, వాంబే కాలనీ సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, కౌంటింగ్ రోజున వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని వెల్లడించారు. ఈ సోదాల్లో పీఎంపాలెం సీఐ రామకృష్ణ, ఎస్ఐలు సునీత, సురేష్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ, మే 31 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పీవీ ముకుందరావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమతా కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ పర్యావరణ దినోత్సవంగా భావించి, అందుకు తగ్గ కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఇంజనీర్ ఏఎస్ఆర్‌సీ మూర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించేవారికి మరింత ప్రోత్సాహం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమత కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, బోటనీ అధ్యాపకుడు రాజా ప్రవీణ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ సిబ్బందికి సన్మానం



అటెండర్లను సన్మానిస్తున్న వీఎంఆర్డీఏ అధికారులు

సిరిపురం, మే 31 : వీఎంఆర్డీఏకు సుదీర్ఘకాలంగా సేవలందించిన అటెండర్లు కె. నారాయణరావు, డి. అప్పలరాజు, సూరమ్మ సేవలను మరిచిపోలేనివని అధికారులు కొనియాడారు. శుక్రవారం సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో పదవీ విరమణ పొందిన వారిని కార్యాలయం అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలల వివరాలపై ఆరా

ఆరిలోవ, మే 31 : జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలియజేయాలని అన్ని జిల్లాల డీఈఓలకు ఆదే శాలు జారీ చేసినట్టు ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పిల్లలను గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించడం వల్ల వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. గుర్తింపు లేని పాఠశాలలు నడిపే యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి : ఏడీసీ



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న ఏడీసీ సన్యాసిరావు

వెంకోజీపాలెం, మే 31 : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు అన్నారు. జీవీఎంసీలోని పలు విభాగాల్లో పని చేసిన రిటైర్డ్ అయిన 15 మంది ఉద్యోగులను శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు చేసిన సేవలే వారికి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు అధికారి ఫణిరామ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మజ, ఏపీఎంఈఎస్ఏ కార్యవర్గ సభ్యులు అప్పలరాజు,జేమ్స్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ నాయకులు బాధ్యతగా వ్యవహరించాలి'

తగరపువలస, మే 31 : ఓట్ల లెక్కింపు సమయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని నార్త్ జోన్ ఏసీపీ సునీల్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన తగరపువలసలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి గొడవలు, కొట్లాటలు లేకుండా సామరస్యంగా వ్యవహరించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రం నుంచి టీవీల ద్వారా వచ్చే సమాచారానికి అతిగాస్పందించకుండా సంయమనంగా ఉండాలని కోరారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని దాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గొడవలు, కొట్లాటలకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భీమిలి సీఐ డి. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్ఐలు హరీష్, పైడిరాజు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



పోటీలో తలపడుతున్న జట్లు

భీమునిపట్నం, మే 31 : బీచ్‌రోడ్ తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్‌లో శుక్రవారం నుంచి రాష్ట్రస్థాయి 9వ రగ్బీ జూనియర్ బాల, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జీవీఎంసీ డెప్యూటీ మేయరు జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రగ్బీ పోటీలో విద్యార్థులు వేగవంతంగా పట్టుదలతో తర్ఫీదు పొందుతూ, ఉత్సాహవంతంగా పాల్గొంటున్నారన్నారు. క్రీడాకారులు మంచి నైపుణ్యతతో వివిధ పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తొలుత ఆయన 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కాగా బాలికల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌కు అనంతపురం, కర్నూల్, ప్రకాశం, తూర్పు గోదావరి, గుంటూరు జట్లు చేరాయి. బాలుర విభాగంలో నెల్లూరు,కర్నూలు, గుంటూరు, శ్రీకాకుళం, ప్రకాశం, తూర్పుగోదావరి జట్లు చేరాయి. 2 రోజుల పాటు పోటీలు జరుగుతాయని రగ్బీ జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిషోర్, విజ్ఞాన్ స్కూల్ ఏవో సురేష్, తాతాజీ, పాల్గొన్నారు.



తగరపువలసలో దుకాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగింపు

తగరపువలస, మే 31 : స్థానిక సంత ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను జీవీఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు బి. రేష్మ, డి. సాయిగోపాల్ దుకాణాలను తొలగించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నడవడానికి కూడా అవకాశం లేకుండా ఆక్రమణలు ఉండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పలువురు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వ్యాపారులకు గతంలో నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో దుకాణాలను తొలగించారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించి ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన దుకాణాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు టౌన్ ప్లానింగ్ కార్యదర్శుల సమక్షంలో శుక్రవారం తొలగించారు. రహదారులపై ఇష్టారాజ్యంగా దుకాణాలు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలను క్రేన్ సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో వార్డు టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు వీరేంద్ర, సతీష్, వెంకటేష్, నిస్సార్, చంద్రశేఖర్, భవ్య, హేమసుందర్, సంతోష్, శివాజీ, చైన్‌మెన్ రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే

భీమునిపట్నం, మే 31 : ప్రత్యేక అవసరాల పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ ఎం. శివరాణి కోరారు. శుక్రవారం ఆమె సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కో ఆర్డినేటర్ గీత, భీమిలి భవిత కేంద్రం ఐఈఆర్‌పీ కుమారి, పార్వతితో కలిసి 4వ వార్డులోని కె. నగరపాలెం, పెద ఉప్పాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బడి బయట వున్న నలుగురు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ 18ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల పిల్లలను సమీపంలో వున్న ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేయించి, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వున్న భవిత కేంద్రానికి పంపించాలన్నారు. భవిత కేంద్రంలో చేరిన వారికి వీల్ చైర్లు, హియరింగ్ మిషన్స్, ఎంఆర్ కిట్లు ఉచితంగా అందజేస్తామన్నారు. అలాగే ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్, గర్ల్స్ స్టైఫండ్, హోమ్ బేస్డ్ అలవెన్స్ అందజేస్తామని చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 47 మంది పిల్లలను గుర్తించామన్నారు.

కృష్ణంరాజుపేటలో గోపూజ



గోపూజ చేస్తున్న గ్రామస్తులు

భీమునిపట్నం (రూరల్), మే 31 : మండలంలోని కృష్ణంరాజుపేట రామాలయంలో విశాఖ గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గో పూజ నిర్వహించారు. సమితి జిల్లా ప్రముఖ్ తిరుపతయ్య ఆధ్వర్యంలో ముందుగా గణపతిపూజ చేసిన అనంతరం గోవులను పూజించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. రసాయనిక ఎరువులు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, సర్పంచ్ జి. వెంకటనారాయణ, సింగనబందకు చెందిన సురాల వెంకటరావు, గుడ్డాల ఎల్లయ్య, గాడు తాతినాయుడు, నీలాపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో స్టేషనరీ విభాగం గది



పెచ్చులూడి కింద పడిన శ్లాబ్

సింహాచలం, మే 31 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన స్టేషనరీ విభాగం గది శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. ప్రస్తుతం స్టేషనరీ విభాగాన్ని కొండదిగువ దేవస్థానం బస్ బుకింగ్ వెనుక విశాలమైన హాల్‌లో నిర్వహిస్తున్నారు. అయితే ఈ భవనాన్ని నిర్మించి కొన్నేళ్లు కావడంతో గోడలు బీటలు వారి, శ్లాబ్ పూర్తిగా పాడైంది. దీంతో వర్షం పడితే నీరు గదిలో చేరి సామగ్రి తడిచి పాడవుతున్నది. తాజాగా గురువారం రాత్రి సిబ్బంది విధులు పూర్తి చేసుకుని వెళ్లే సమయంలో శ్లాబ్ పైభాగం పెచ్చులూడిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.అలాగే బస్సు టికెట్ కౌంటర్ ఉన్న గది శ్లాబ్ కూడా దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు భయపడుతున్నారు. దేవస్థానం అధికారులు తక్షణమే స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్న సన్నిధిలో హనుమత్ దీక్షాధారులు

సింహాచలం, మే 31 : తెలంగాణలోని జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన హనుమత్ దీక్షధారులు శుక్రవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మొత్తం 36 మంది సింహగిరికి చేరుకుని స్వామివారికి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కార్మిక నేత శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం

వెంకోజీపాలెం, మే 31 : ఆర్‌టీసీ ఎం ప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకుడు కె. శివాజీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయా లని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖ డిపో యూనియన్ కార్యాలయంలో శివాజీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసిన శివాజీ అకాల మృతి ఈయూకి, కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. ఏటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ఏటీయూసీ బలోపేతానికి శివాజీ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నందమూరి వెంకట రామారావు, జోనల్ అధ్యక్షుడు శుభాకార్, జిల్లా అధ్యక్షుడు మూర్తి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నం : ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం పురస్కరించుకుని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, సీఐఐ ఆధ్వర్యంలో నోటి పొగాకు ఉత్పత్తుల వినియోగం, ఈ-సిగరెట్ల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను సీపీ రవిశంకర్ అయ్యన్నార్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేన్సర్ ఆస్పత్రి వైద్యుడు వున్నా మురళీకృష్ణ, సీఐఐ ప్రతినిధి హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.